క్లుప్తంగా

గోవులను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి : అక్రమంగా గోవులను రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలను తీసుకోవాలని బజరంగ్‌దళ్ నాయకులు శనివారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్‌కు వినతిపత్రం అందించారు. గోవుల రవాణాను అరికట్టి గోవధ జరగకుండా తగిన చర్యలను తీసుకోవాలని వారు విన్నవించారు. గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు వినోద్, తులసి, భరత్ తదితరులున్నారు.

విద్యార్థులకు సన్మానం



బాన్సువాడ : నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మైనార్టీ నాయకులు, మాజీ వార్డు సభ్యులు అక్బర్ ఆధ్వర్యంలో సన్మానించారు. బాన్సువాడ మండలానికి చెందిన ఐదురుగు విద్యార్థులు నీట్‌లో ప్రతిభా కనబర్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖలీల్, అంబాజీ, హైమద్ తదితరులు ఉన్నారు.

కోర్టు ఆవరణలో అన్నదానం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమ నేపథ్యంలో అయ్యప్ప దేవాలయ, అయ్యప్ప అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద సేవాసమితి అధ్యక్షులు గందె శ్రీనివాస్, ఆలయ కమిటీ కార్యదర్శి గోనే శ్రీనివాస్, కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్, కోశాధికారి పేపర్ శ్రీనివాస్, మోత్కూరు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎంపీ సురేశ్ షెట్కార్‌కు సన్మానం



బాన్సువాడ : జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను శనివారం బోర్లం గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఆయన విజయంసాధించిన సందర్భంగా సన్మానించారు. ఎంపీని కలిసిన వారిలో బోర్లం గ్రామ కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, గంగారాం, దేవేందర్ రెడ్డి తదితరులున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎల్లారెడ్డి : పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, బజరంగ్‌దల్ నాయకులు, మైనార్టీ నాయకులు ఉన్నారు.

స.హ.చట్టం కరపత్రం ఆవిష్కరణ



దోమకొండ : దోమకొండ పోలీస్ స్టేషన్లో సమాచార హక్కు చట్టం 2005 అవగాహన కరపత్రాన్ని స్థానిక ఎస్సై చిందం గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా పోలీస్ స్టేషన్లో కూడా సమాచారాన్ని పొందవచ్చని అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్, చార్జిషీట్ కాపీలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అలీబద్దీన్, జిల్లా సలహాదారులు మద్దూరి శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా మృగశిరకార్తె

- మామిడిపండ్లకు, చేపలకు పెరిగిన గిరాకీ



నస్రుల్లాబాద్‌లో చేపలు కొంటున్న ప్రజలు



తాడ్వాయి మండల కేంద్రంలో చేపలు అమ్ముతున్న వ్యాపారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం మృగశిర కార్తె(మిర్గం) పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేపలను కొని తీసుకెళ్లారు. ప్రతి ఏడాది మిర్గం పండుగ రోజు చేపలను వండి తినడం ఆనవాయితీగా వస్తోంది. రోహిణి కార్తెలో కాచిన ఎండల నుండి ఉపశమనం కోసం మృగశిర కార్తె ప్రారంభంలో చేపలను తినడం వలన ఆరోగ్యానికి బాగుంటుందని పలువురు పేర్కొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు శనివారం మృగశిర కార్తెను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్నానాలు చేసి గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా ప్రత్యేకంగా చేపలు కొనుగోలు చేసి తమ ఇళ్లలో వంటలు చేసుకొని ఆనందోత్సహాల మధ్య మృగశిర కార్తెను ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాది పాటు వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతామూర్తులను వేడుకున్నారు. అలాగే సాయంత్రం వేళల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేకంగా ఇంగువను బెల్లంలో కలిపి నోటిలో వేసుకున్నారు. చేపమందు వేసుకోవడానికి కామారెడ్డి జిల్లా కేంద్రానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో మృగశిర కార్తెను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మృగశిర కార్తె పండగలో భాగంగా చేపలు, మామిడి పండ్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. వాటిని కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి కనబర్చారు. మృగశిర కార్తె రోజున చేపలు తినడం వల్ల ఆస్తమా లాంటి రోగాలు వ్యాపించవనే నమ్మకంతో చేపలకు భారీగా డిమాండ్ ఏర్పడింది.



ఎల్లారెడ్డిలో పండ్లను కొంటున్న ప్రజలు

లోక్‌అదాలత్ విజయవంతం

- జిల్లాలో 3,819 కేసుల పరిష్కారం



కేసులను పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి వరప్రసాద్

కామారెడ్డి క్రైం : జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 3,819 కేసులను పరిష్కరించారు. వాటిలో 3,793 క్రిమినల్ కేసులు, 19 సివిల్ కేసులున్నాయి. ఒక్క కామారెడ్డి కోర్టు లోనే 2,350 కేసులు పరిష్కారం అయ్యాయి. కామారెడ్డిలో జిల్లా జడ్జి వరప్రసాద్, అదనపు జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి టీ.నాగరాణిల ఆధ్వర్యంలో కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి వరప్రసాద్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్ లో సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్, అన్ని రకాల కేసులను ఇరుపక్షాల ఆమోదంతో రాజీపద్ధతిలో సత్వర పరిష్కరానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రీ లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. సుధాకర్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, ఏఎస్పీ నర్సింహా రెడ్డి, పీపీ లు రాజగోపాల్ గౌడ్, అశోక్ శివరాం, నిమ్మ దామోదర్ రెడ్డి, న్యాయవాదులు రమేష్ చంద్, మోహన్ రావు, చిరంజీవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, అధికారులు భుజంగ రావు, వెంకట్ రెడ్డి, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం



బాన్సువాడలో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

బాన్సువాడ : రాజీ మార్గమే కేసుల పరిష్కారానికి రాచ మార్గమని బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. శనివారం బాన్సువాడ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాలు రాజీ కుదుర్చుకునే మార్గం ఎంచుకోవాలన్నారు. బాన్సువాడ కోర్టులో క్రిమినల్, సివిల్ 267 కేసులు పరిష్కారించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణమూర్తి, ఖలీల్, రాంరెడ్డి, రమాకాంత్, లక్ష్మారెడ్డి, హమీద్ ఉన్నారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న జడ్జి హారిక

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ కేసులను ఆమె పరిష్కరించారు. కార్యక్రమంలో పీపీ వీరయ్య, ఏజీపీ శ్రీనివాస్, న్యాయవాదులు పండరి, నవీద్, శ్రీకాంత్, సాయిప్రకాష్ దేశ్‌పాండే, సతీష్, సాయిబాబా, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా మారిన పురాతన బావి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంపు–అంకోల్ గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ భూమిలో ఉన్న బావి ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందల సంఖ్యలో ఇదే మార్గంలో ఉన్న వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అయితే రోడ్డు పక్కనే ఉన్నా కూడా కనీసం కంచె ఏర్పాటు చేసే నాథుడే కరువయ్యారు. గతంలో రహదారికి పక్కనే ఉన్న వ్యవసాయ బావులలో బస్సులు పడి, స్కూల్ పిల్లలకు కూడా ప్రమాదాలు జరిగిన ఘటనలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంకోల్ ప్రధాన రహదారికి పక్కన గల బావికి కంచెను ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు ఉంచాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం ఆలయ అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహారాజ్‌లు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాలను గ్రామంలో భజన, కీర్తనలతో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.

11న పాత హన్మాన్ ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పెద్ద బజార్ పాత అంజనేయ ఆలయం పునర్నిర్మాణ ప్రథమ వార్షికోత్సవం వేడుకల సందర్భంగా ఈనెల 11న మంగళవారం మనోభిలషిత అనుగ్రహ హన్మాన్ సామూహిక వత్రం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. హనుమాన్ వత్రంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం 8 గంటలకు వస్తే సరిపోతుందన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో ఉన్న వేంకటేశ్వరాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో చావ తీశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు సిద్దిరాంరెడ్డి, గంగారాం తదితరులున్నారు.

ఉపాధి కూలీలకు కూలి పెంచాలి



భిక్కనూరు : ఉపాధి కూలీలకు రోజుకు రూ. 300 కూలి ఇవ్వాలని జిల్లా సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి గంగ్గల రవీందర్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలోని ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. తమకు రోజులకు రూ. 60 మాత్రమే కూలీ పడుతుందని వసతులు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్పీని సన్మానించిన చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ శనివారం జిల్లా ఎస్పీ సింధు శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని శాలువాలో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకృష్ణమూర్తి, వంశీ పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి



మద్నూర్(జుక్కల్) : మండలంలోని పల్లెలకు వెళ్లే రహదారులపై ఉన్న గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నఎక్లార, కోడిచిర వెళ్లే రహదారిలో ఎన్నో ఏళ్లుగా రోడ్డు అస్తవ్యస్తంగా తయారైనా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు.

గురుకుల పాఠశాలతో సౌలభ్యం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ : గ్రామీణ ప్రాంత గిరిజన విద్యార్థులకు గురుకుల పాఠశాల ఏర్పాటు వరంలా మారనుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోనాపూర్–హన్మాజీపేట్ గ్రామాల మధ్య శివారులో రూ.కోట్లతో నిర్మించే గిరిజన గురుకుల పాఠశాల భవనం పనులకు భూమిపూజ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హయాంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. గిరిజనుల్లో ఎక్కువగా పేదరికంతో ఉంటారని, వారి పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో గిరిజన బాలికల గురుకుల పాఠశాలను మంజురు చేయించామన్నారు. నస్రూల్లాబాద్‌లో గిరిజన బాలుర గురుకుల పాఠశాల కొనసాగుతున్న విషయం గుర్తు చేశారు. ఆయన వెంట నాయకులు అంజిరెడ్డి, సంగ్రాం, సుధాకర్ రెడ్డి, హన్మాండ్లు, సాయిలు, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



కామారెడ్డి అర్బన్ : స.హ.చట్టం, మానవ హక్కులపై ప్రజలను చైతన్యం చేస్తున్న తమ సంస్థలకు సహకారం అందించాలని సహ చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనితను కోరారు. శనివారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌ను కలిసిన సహ చట్ట పరిరక్షణ, మానవ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, అలీమొద్దీన్, కాసర్ల లింగం, ఎంవీ భాస్కర్ తదితరులున్నారు.

పోలీసుల తనిఖీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : వాహనలు నడిపేటప్పుడు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని పోలీసులు తెలిపారు. శనివారం మండలంలోని బేగంపూర్ చౌరస్తా 161 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్, సిబ్బంది అంజి, రవి తదితరులున్నారు.

యూనిఫామ్స్ సకాలంలో అందించాలి



దుస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బీబీపేట : మండల కేంద్రంలోని మహిళల ద్వారా నిర్వహిస్తున్న మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు కుడుతున్న యూనిఫామ్స్‌ను ఆయన పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందేలా మహిళలు టైలరింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఒక రోజుకు ఎన్ని డ్రెస్సులు కుడుతున్నారని దానికోసం ఎంత సమయం పడుతుందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీడీ మురళి, డీపీఎంలు సుధాకర్, సురేష్, ఏపీఎం బాల పోచయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్రవంతి, సీసీలు శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి వివోఏలు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ చూపాలి



నిజాంసాగర్(జుక్కల్) : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ కో ఆర్డినేటర్ ప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని అచ్చంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. చిన్నారుల బరువుల్లో తేడా వస్తే తల్లిదండ్రులకు సమాచారం ఇస్తూ పౌష్టికాహారం అందించాలన్నారు. ఆయన వెంట అంగన్ వాడీ కేంద్రాల టీచర్లు రోజా, విజయ, నాగమణి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పర్మళ్లలో శనివారం గ్రామ దేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు భక్తులు పలు ఎడ్లబండ్లకు కొత్తబట్టలు, మామిడి తోరణాలు, పసుపు, కుంకుమ, రంగులు అద్ది అలంకరించారు. గ్రామ శివారులోని దుర్గమ్మ, ముత్యాల పోచమ్మ, నల్లపోచమ్మ, కట్టమైసమ్మ, ఎల్లమ్మ ఆలయాల చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు చక్రపాణి

బాన్సువాడ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి డిమాండ్ చేశారు. శనివారం ఆయన బాన్సువాడలో మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం పథకం పెండింగ్‌లో ఉన్న రూ.8 కోట్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని సూచించారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 11న ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. బిల్లులు మంజూరు చేయకుంటే సమ్మె నోటీసు ఇస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు, మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి



విత్తనాలను అందిస్తున్న వ్యవసాయ అధికారిణి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రైతులు నేటి తరం వ్యవసాయంలో టెక్నాలజీని వినియోగించుకుని అధిక దిగుబడులను సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చెరుకు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతు రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించి లాభాలను ఆర్జించాలన్నారు. సింగిల్ విండో చైర్మెన్ సదాశివరెడ్డి, గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఏవో మల్లహరి,వీడీసీ అధ్యక్షులు నర్సింలు తదితరులున్నారు.

సంక్షిప్తం

నస్రుల్లాబాద్‌లో చిరుజల్లులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం తొలకరి పలకరించింది. మృగ శిర కార్తె ప్రారంభం రోజున ఖచ్చితంగా వర్షం కురుస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భూమి కాస్త చల్ల బడిందని దీనితో పొలాలను తడిపిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కల్కి కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్ : స్థానిక స్వర్ణయుగ కల్కి భగవాన్, పద్మావతిల కల్యాణోత్సవం ఈనెల 9న ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తునట్టు కల్కి ఆలయ సేవా సమితి తెలిపింది. కల్కి భక్తులు కల్యాణోత్సవంలో విజయవంతం చేయాలని సేవా సమితి కోరింది.

నేటి నుంచి గ్రామ దేవతలకు ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో ఆదివారం నుంచి గ్రామ దేవతలకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ, దుర్గమ్మకు బోనాలు సమర్పిస్తారు. సోమవారం పెద్దమ్మకు బోనాలు, మధ్యాహ్నం నుంచి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుస్తీ పోటీల్లో విజేతలకు మూడు తులాల వెండి కడియం బహూకరించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. శనివారం తెల్లవారుజామున మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో మాట్లాడారు. కార్మికులకు అందాల్సిన దుస్తులు, ఇతర సామగ్రిని కౌన్సిల్ సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకృష్ణమూర్తి, వంశీ తదితరులున్నారు.

కొనసాగుతున్న బడిబాట

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు కలసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బడిబయట పిల్లలను గుర్తించారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అడివిలింగాల, కొక్కొండ, తిమ్మాపూర్, కొత్తపల్లి తదితర గ్రామాలలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించారు.

బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో రాములు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఉపాధ్యాయులు ఖద్గాం, ఫత్లాపూర్, బిచ్కుంద, గుండెకల్లూర్‌లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, మంచి విద్యా, క్వాలీఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారని వివరించారు.